జగన్మాత.. నమోస్తుతే



పొదలకూరు : రాజరాజేశ్వరి అలంకారంలో కన్యకాపరమేశ్వరి

- వైభవంగా నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం

ఇందుకూరుపేట : దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వివిధ ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. సముద్రతీర ప్రాంతమైన మైపాడులో వెలసిన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమ్మవారికి కుంకుమార్చన, పల్లకిసేవ జరిగింది. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి.

గంగపట్నంలో..

గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారు అన్నపూర్ణగా భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజలకు ఉభయకర్తలుగా చాముండేశ్వరీదేవి సేవా సమతి తరఫున గుడి విజయ్‌కుమార్‌రెడ్డి, అనూష దంపతులు వ్యవహరించారు.

మండల కేంద్రంలో..

ఇందుకూరుపేటలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి పల్లకిసేవ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

- పల్లిపాడులోని మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చింతపంటి సురేష్‌బాబు, సమతి దంపతులు వ్యవహరించారు.
- కొత్తూరులోని శ్రీలలితా మహేశ్వరి ఆశ్రమంలో పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు

పొదలకూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు రాజరాజేశ్వరి, అన్నపూర్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామార్చన, త్రిశతి, సాయంత్రం ఖడ్గమాల పూజలు నిర్వహించారు. తరుగు గురవయ్య, తరుగు సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నాగరాజు, ప్రభాకర్, లక్ష్మీనారాయణ వ్యవహరించారు.

శివాలయంలో..

పట్టణంలోని శ్రీకామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి పూజల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులు పూర్తయ్యేంత వరకు అమ్మవారికి ప్రతిరోజు ప్రత్యేక అభిషేకాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం జరిపించారు.

త్రిపురాంబిక అలంకారంలో కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నవరాత్రుల సందర్భంగా జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారు సోమవారం త్రిపురాంబిక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీసూక్త పారాయణం, దేవీసప్తశతి, దేవీ భాగవత పారాయణం జరిపించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : త్రిపురాంబిక అలంకారంలో కామాక్షితాయి

గౌరీదేవిగా పోలేరమ్మ

మనుబోలు : శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురంలోని పోలేర మ్మ ఆలయంలో అమ్మవారు సోమవారం గౌరీదేవి అ లంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీ నివాసులు అమ్మవారికి గౌరీదేవి అలంకారం చేసి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా నీలిశెట్టి వి జయ్‌కుమార్, సుమతి దంపతులు వ్యవహరించారు.



మనుబోలు : గౌరీదేవి అలంకారంలో పోలేరమ్మ



ఇందుకూరుపేట : అన్నపూర్ణదేవిగా చాముండేశ్వరి అమ్మవారు

ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



జ్యోతి వెలిగించి టోర్నీని ప్రారంభిస్తున్న పోర్టు సీఈఓ జీజేరావు

ముత్తుకూరు : ముత్తుకూరుకు సమీపంలోని గోపాలపురంలో ఉన్న అదానీ వరల్డ్ స్కూల్‌లో 2023–24 సీబీఎస్‌ఈ క్లస్టర్–7 అండర్–19 జోనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజేరావు ముఖ్యఅతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 63 పాఠశాలల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఈ టోర్నీలో పాల్గొంటున్నారని తెలిపారు. పోర్టు హెచ్‌ఆర్ హెడ్ గణేష్ శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, అదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్‌భాస్కర్, ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో ప్రముఖులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని దేవదాయశాఖ ఉప కమిషనర్ ఎం.రత్నరాజు సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నెల్లూరు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కూటీ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : స్కూటీ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో సోమవారం జరిగింది. నెల్లూరు నగరం దర్గామిట్ట ప్రాంతానికి చెందిన ప్రసాద్ పనినిమిత్తం స్కూటీలో గొలగమూడికి బయలుదేరాడు. గ్రామ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే స్కూటీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాల్య వివాహాలను అరికడదాం

పొదలకూరు : బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామాల్లో స్వయం సహాయ సంఘాలు సహకరించాల్సిందిగా వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రోజ్‌మేరీ కోరారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులతో పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తమ కుటుంబంలో ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండకుండా వివాహం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

చెస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



వెంకటాచలం : తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో జరుగనున్న సీబీఎస్‌ఈ సౌత్‌జోన్ అండర్ 11, అండర్–14, అండర్–17 చెస్ పోటీలకు మండలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న అక్షర విద్యాలయ విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విభాగానికి నలుగురు చొప్పున మొత్తం 12 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కుముద సోమవారం తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు చెస్ కోచ్ వై.సుమన్ అభినందించారు.

పరిశుభ్రత ఎంతో అవసరం



పల్లిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇందుకూరుపేట : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత అవసరమని 24వ ఆంధ్ర బెటాలియన్ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ జి.పెంచల పుల్లయ్య అన్నారు. మండలంలోని కొత్తూరులో ఉన్న జీవీకే చిన్మయ విద్యాలయంలో యాన్యువల్ క్యాంప్ కార్యక్రమం సోమవారం జరిగింది. అందులో భాగంగా పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెంచల పుల్లయ్య పరిసరాల శుభ్రతపై గ్రామంలో అవగాహన కల్పించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు స్వచ్ఛభారత్‌పై నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను ఎన్‌సీసీ విద్యార్థులు బృందాలుగా ఏర్పడి గ్రామంలో వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సిబ్బంది వెంకటరమణ, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

రూ.50 వేల సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు : మండలంలోని కొత్తవంగల్లుకు చెందిన అనుమలపూడి చెన్నకృష్ణయ్యకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.50 వేల సాయం అందించారు. ఈ గ్రామంలో గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతున్న సమయంలో చెన్నకృష్ణయ్య తన కుమారుడు ఆకస్మికంగా మృతి చెందడం వల్ల కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడిందన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ప్రసన్న ఆర్థిక సాయమందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.50 వేలు అందజేశారు.

టిప్పర్ దిగబడి ట్రాఫిక్‌కు అంతరాయం

పొదలకూరు : పట్టణంలోని మెయిన్‌రోడ్డులో సోమవారం టిప్పర్ దిగబడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలో గత కొద్ది రోజులుగా సిమెంటురోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో టిప్పర్ దిగబడిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకుని టిప్పర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

వైఎస్సార్‌సీపీలో 150 కుటుంబాలు చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన టీడీపీ, సీపీఎం పార్టీలకు చెందిన 150 కుటుంబాల వారు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో నెల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పెనుబల్లి సర్పంచ్ గోడ పెంచలయ్యతో పాటు చంద్రశేఖర్, కల్యాణ్, వెంకటేష్, కిశోర్, మధుసూదన్, వంశీ, కార్తీక్, బాలకృష్ణ, విజయ్ కుమారితో పాటు అధిక సంఖ్యలో మహిళలు పార్టీలో చేరగా ఎమ్మెల్యే ప్రసన్న వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ప్రసన్న మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నట్లు తెలిపారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, వవ్వేరు బ్యాంక్ చైర్మన్ ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రసాద్, పార్టీ నేత విల్సన్ తదితరులు పాల్గొన్నారు

పర్వతారోహకుడికి రూ.38 లక్షలు

పెనుబల్లికి చెందిన పర్వతారోహకుడు వెంకట సూర్యప్రకాష్ 40 రోజుల్లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.38 లక్షలు మంజూరు కాగా దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు.

చేకూరిన లబ్ధిని ప్రజలకు చెప్పండి

- 2024లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయం
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : గత నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును ఇంటింటికి వెళ్లి చెప్పాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గృహ సారథులు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు' కార్యక్రమం మనుబోలు మండల కేంద్రంలోని సీపీఆర్ కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ప్రతి హామీని నిలబెట్టుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌ది అని, ఇచ్చిన ప్రతి హామీని తుంగలో తొక్కిన ఘనుడు చంద్రబాబు అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మాటిస్తే శిలాశాసనం లాంటిదని, అయితే ప్రతిపక్ష నేత చంద్రబాబు మాత్రం అలవోకగా అబద్ధాలు చెబుతాడన్నారు. పార్టీ మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ గ్రామాలకు వెళ్లి వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. గ్రామాల్లో బస చేయాలన్నారు. తాను కూడా ప్రతిరోజు ఒక్కో మండలానికి వచ్చి పాల్గొంటానని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే 2024లో మరోసారి ఘన విజయం ఖాయమని భరోసా ఇచ్చారు. అలాగే పలువురు నాయకులు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో పేదలకు అండగా నిలిచిన కాకాణి సేవలను కొనియాడారు.



గృహ సారథులకు బుక్‌లెట్ కిట్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి

చంద్రబాబు చిన్నతనం నుంచే దొంగ

ప్రతిపక్ష నేత చంద్రబాబు చిన్నతనం నుంచే దొంగ అని మంత్రి కాకాణి అన్నారు. సాధారణంగా ఎక్కడైనా పేదవాడు రూ.లక్ష దొంగతనం చేస్తే జైల్లో వేస్తారని, అలాంటిది చంద్రబాబు రూ.370 కోట్ల ప్రజాధనం లూటీ చేస్తే జైల్లో వేయరా అని ప్రశ్నించారు. అనంతరం గృహ సారథులకు బుక్‌లెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, ఎంపీపీ వజ్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు అనితమ్మ, సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు హరగోపాల్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిమోహన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆదినారాయణ, ఎంవీబీరెడ్డి, కిశోర్‌నాయుడు, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న చిల్లకూరు సుధీర్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి అన్నారు. స్థానిక రిషీ గ్రాండ్ కల్యాణ మండపంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి నేతలు, సచివాలయ కన్వీనర్లు, బూత్‌లెవల్ కమిటీ కన్వీనర్లకు ఆయన పలు సూచనలు చేశారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ఘనత సీఎం జగన్‌కే సాధ్యమన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ పేదలకు జరిగిన మేలును పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. జేసీఎస్ మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు మాట్లాడుతూ సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎంగా వైఎస్ జగన్ ఎందుకు అవసరమో ప్రజలకు తెలియజేయాలని వివరించారు. ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులు నాయుడు, నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిరంజీవులగౌడ్, స్థానిక నేతలు పురందర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, రామాచార్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో రూ.3.40 లక్షలు మాయం

మనుబోలు : మనుబోలులోని ఓ మద్యం దుకాణంలో రూ.3.40 లక్షలు మాయమైంది. దుకాణంలో పనిచేసే సేల్స్‌మెన్ పరారీలో ఉండడంతో అతని పనేనని అందరూ అనుమానిస్తున్నారు. మనుబోలు పరిధిలోని పిడూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో సోమవారం ఉదయం సూపర్‌వైజర్ అనిల్ నగదు లెక్కలు చూడగా రూ.3.40 లక్షలు మాయమైనట్లు గుర్తించారు. ప్రతిరోజు మద్యం అమ్మగా వచ్చే నగదును సూపర్‌వైజర్ మరుసటి రోజు బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. శని, ఆదివారం వరుస సెలవులు రావడంతో సోమవారం మూడు రోజుల నగదు డిపాజిట్ చేయాల్సి ఉంది. అయితే కౌంటర్‌లో ఉండాల్సిన నగదును సేల్స్‌మెన్ మస్తానయ్య తీసుకుని ఉడాయించినట్లు అనుమానిస్తున్నారు. సూపర్‌వైజర్ అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎక్సైజ్ సీఐ రామారావు, ఎస్సై రాఘవయ్య రికార్డులు పరిశీలించి విచారణ చేస్తున్నారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేగడిచెలికలో సోమవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, వృద్ధులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో సురక్ష లాంటి కార్యక్రమం లేదన్నారు. వైద్య నిపుణులు పేదల గడపకు రావడం ఇప్పటి వరకు జరగలేదన్నారు. కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడంతో పాటు ఇంటి వద్దకే వైద్య నిపుణులను పంపేలా సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. సంజీవని లాంటి ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, నుడా వీసీ బాపిరెడ్డి, వైద్యాధికారి ఎం.రామకృష్ణ, ఈఓపీఆర్డీ డేవిడ్, ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్‌లు నల్లావుల శ్రీనివాసులు, పెనాక అనూష, సొసైటీ చైర్మన్ శివకుమార్, ఎంపీటీసీ కె.రాజమ్మ, నాయకులు టి.కళాకృష్ణ, పి.సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.



వృద్ధురాలికి కంటి అద్దాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

నేడు మంత్రి కాకాణి రాక

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు పట్టణంలోని పోలేరమ్మ తల్లి దేవస్థాన వార్షికోత్సవానికి హాజరవుతారని దేవస్థాన నిర్మాణ దాత వూకోటి లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. వార్షికోత్సవ పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

నేడు ముత్తుకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

ముత్తుకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముత్తుకూరు–2 సచివాలయంలో మంగళవారం జరుగుతుందని ట్రేడ్ యూనియన్ కన్వీనర్ గండవరం సూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొనే కార్యక్రమంలో టోకెన్లు తీసుకున్న వారంతా వైద్య పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగనన్నకు చెబుదాంలో అర్జీల స్వీకరణ

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా పొలం కొలతలు, పాసుపుస్తకాలు, దారి గొడవలకు సంబంధించి రైతులు వినతిపత్రాలను అందజేశారు. వీటిపై విచారణ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలియజేశారు.

నేడు వెంకటాచలంలో 'ఏపీకు జగనే ఎందుకు'

వెంకటాచలం : మండల కేంద్రమైన వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు' అనే కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య సోమవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



పొదలకూరు : రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



పొదలకూరు : మందులను అందజేస్తున్న వైద్య సిబ్బంది

పొదలకూరు : మండలంలోని నేదురుమల్లి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించారు. మహ్మదాపురం వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లారు. ఇంటింటి సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో పొదలకూరు సీహెచ్‌సీ వైద్యనిపుణులు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్ ఉడతా రమేష్, ఎంపీటీసీ సభ్యుడు టి.పెంచలనాయుడు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, తహసీల్దార్ కె.వీరవసంతరావు పాల్గొన్నారు.

దంపూరులో..

విడవలూరు : మండలంలోని దంపూరు పంచాయతీ జెడ్పీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును సోమవారం నిర్వహించారు. మండలంలో మొత్తం 11 క్యాంపులు నిర్వహించామని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం సర్పంచ్ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్షయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నేతలు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, వెంకటరమణారెడ్డి, భానుప్రకాశ్, నారాయణ, లక్ష్మీనారాయణ, నాగేంద్ర పాల్గొన్నారు.



విడవలూరు : పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న స్థానిక నేతలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీమాతమ్మ అమ్మవారి ఆలయంలో గ్రామ నాభి శిలాప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. నిర్వాహకుడు కాటంరెడ్డి వసంతకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ జరిగిన వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, పూజలు చేశారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు.

చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నప్రసాద వినియోగం జరిగింది.



ఆశీర్వచనాలు తీసుకుంటున్న మంత్రి కాకాణి